సాక్షి నల్లగొండ

గురువారం । 28 । సెప్టెంబర్ । 2023



మిర్యాలగూడ బంద్ ప్రశాంతం

మిర్యాలగూడను జిల్లా చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం చేపట్టిన పట్టణ బంద్ ప్రశాంతంగా ముగిసింది. - 8లో



ఆదాయం రూ.17.54లక్షలు

మూడు నెలలకు మట్టపల్లి ఆలయ హుండీ ఆదాయం రూ.17,54,845 వచ్చినట్లు అధికారులు తెలిపారు. - 8లో



ఓటమి తప్పదు

హామీలు అమలు చేయకుంటే బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఓటమి తప్పదని జూలకంటి రంగారెడ్డి అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

హిందూ ముస్లింల ఐక్యతకు తెలంగాణ నిలయం

- ముస్లిం మైనార్టీలకు మంత్రి మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు

సూర్యాపేట: హిందూ ముస్లింల ఐక్యతకు తెలంగాణ నిలయమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో సర్వమానవ సౌభ్రాతృత్వం పరిఢ విల్లుతున్నదని, అందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకుంటున్న నిర్ణయాలే దోహద పడ్డాయని కొనియాడారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని జరుపుకోబోతున్న ముస్లింలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

స్ఫూర్తి ప్రదాత.. కొండా లక్ష్మణ్ బాపూజీ



బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్ తదితరులు

నల్లగొండ: స్వాతంత్య్ర సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ నేత, బడుగు బలహీన వర్గాల స్ఫూర్తి ప్రదాత కొండా లక్ష్మణ్ బాపూజీ అని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.శ్రీనివాస్ అన్నారు. బుధవారం కొండా లక్ష్మణ్ బాపూజీ 108వ జయంతి సందర్భంగా కలెక్టరేట్ ఆయన చిత్రపటానికి అదనపు కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ క్విట్ ఇండియా, తెలంగాణ ఉద్యమాల ద్వారా అటు దేశానికి.. ఇటు తెలంగాణ సమాజానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. తొలి, మలిదశ తెలంగాణ పోరాటాల్లో ఆయన ఎంతో చురుగ్గా పాల్గొన్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఖాజా నజీం అలీ, మత్స్య శాఖ అధికారి వెంకయ్య, మెప్మా పీడీ కరుణాకర్, ఉజ్జిని యాదగిరి రావు, చక్రహరి రామరాజు, సిరిపోలు వేంకటపతి, గంజి మురళీధర్, దుడుకు లక్ష్మీనారాయణ, రాపోలు దత్త గణేష్, జెల్ల భిక్షం, శంకర్ ముదిరాజ్, కంది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి



ఈకేవైసీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

చిట్యాల: రేషన్ కార్డు లబ్ధిదారులంతా ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. చిట్యాలలోని పలు రేషన్ దుకాణాలు, రైస్ మిల్లులను బుధవారం ఆయన డీసీఎస్ఓ వెంకటేశ్వర్లుతో కలిసి ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. ఈ నెల 30వ తేదీ వరకు రేషన్ దుకాణాలను తెరిచి ఉంచాలన్నారు. రేషన్ దుకాణాలు తెరవకుండా, ఈకేవైసీ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే రేషన్ వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని రైస్ మిల్లర్స్ 2022–23లో వానాకాలం 78లక్షల మెట్రిక్ టన్నులు, యాసంగికి సంబంధించి 3.91 లక్షల మెట్రిక్ టన్నుల వరకు పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్‌ను వెంటనే ప్రభుత్వానికి అందించాలన్నారు. కార్యక్రమంలో డీఎం నాగేశ్వర్, రైస్ మిల్లర్స్ ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్‌తో నేడు ఫోన్ ఇన్



వెంకటయ్య, మున్సిపల్ కమిషనర్, దేవరకొండ

దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ కాలనీల్లో పారిశుద్ధ్యం లోపించింది. ఇటీవల కురిసిన వర్షాలకు పలుచోట్ల మురుగునీరు చేరి ఇబ్బందిగా మారింది. దోమల బెడద కారణంగా ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. పారిశుద్ధ్య సమస్యతో పాటు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు, డ్రెయినేజీ, కోతుల బెడద తదితర సమస్యలను ప్రజలు మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. మీ ప్రశ్నలకు కమిషనర్ సమాధానం ఇస్తారు.

తేదీ. 28.09.2023 (గురువారం)
ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్ :
91103 59838

వెళ్లిరా.. వినాయకా

- గంగ ఒడికి గణనాథుడు
- భక్తుల కోలాహలం నడుమ సాగిన శోభాయాత్ర
- ప్రశాంతంగా ముగిసిన గణేశ్ నిమజ్జనం



నల్లగొండలో డోలు వాయిస్తున్న యువతి



నల్లగొండలో క్లాక్ టవర్ సెంటర్‌లో శోభాయాత్రను తిలకిస్తున్న భక్తజనం

రామగిరి(నల్లగొండ): తొమ్మిది రోజుల పాటు భక్తుల పూజలందుకున్న గణనాథుడి శోభాయాత్ర బుధవారం జిల్లాలో కనుల పండువగా జరిగింది. జిల్లా కేంద్రంతోపాటు దేవరకొండ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్, నకిరేకల్, చండూరు, చిట్యాల తదితర ప్రాంతాల్లో వినాయకుడి శోభాయాత్ర ఉదయం నుంచే ప్రారంభమైంది. తీన్మార్ స్టెప్పులు, కోలాటాలు, డీజే పాటలతో యువత నృత్యాలు సంబరాలు అంబరాన్నంటాయి. నల్లగొండలో భీమసముద్రం, వల్లభరావు చెరువు, దేవరకొండ పరిసర ప్రాంతాల్లో కొండభీమనపల్లి, పెద్దమునిగల్, డిండి చెరువు వద్ద నిమజ్జం చేశారు. మిర్యాలగూడ విగ్రహాలను వాడపల్లి వద్ద, నాగార్జునసాగర్, అడవిదేవులపల్లి వద్ద కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. జిల్లా అంతటా ఏడు వేల విగ్రహాలను ప్రతిష్ఠించగా బుధవారం 5వేల విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. నల్లగొండలో వినాయక శోభాయాత్ర శోభాయమానంగా కొనసాగింది.



నల్లగొండలో శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల, కలెక్టర్, ఎస్పీ



నకిరేకల్ : శోభాయాత్రలో భక్తుల కోలాట ప్రదర్శన

పాతబస్తీలో ప్రారంభమైన శోభాయాత్ర

వినాయకుడి శోభాయాత్రను బుధవారంకలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్, ఎస్పీ, అపూర్వరావు, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పాతబస్తీ ఒకటవ నంబర్ విగ్రహం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

“ గణేశుడి ఆశీస్సులు ఉండాలి

గణేశుడి ఆశీస్సులు అందిరికీ ఉండాలి. మొదటిసారి లడ్డూ వేలం పాటలో పాల్గొన్నాను. పాల్గొనే ముందే ఎంత వరకు అయిన పర్వాలేదు లడ్డూ దక్కించుకోవాలని నిశ్చయించుకున్నాను. గణేషుడి ఆశీస్సులతో లడ్డూ దక్కడ సంతోషంగా ఉంది.

– పెరిక కరణ్ జయరాజ్, పాతబస్తీలో లడ్డూను దక్కించుకున్న వేలందారుడు



భీమ సముద్రంలో వినాయకుడి నిమజ్జనం

రూ.36 లక్షలు పలికిన పాతబస్తీ గణేశుడి లడ్డూ



నల్లగొండ పట్టణంలో బుధవారం నిర్వహించిన వేలం పాటలో వినాయకుడి లడ్డూ అత్యధిక ధర పలికింది. నల్లగొండ పాతబస్తీలోని ఒకటవ నంబర్ గణేశ్ విగ్రహం వద్ద వేలం పాట నిర్వహించారు. ఇందులో పట్టణానికి చెందిన పెరిక కరణ్‌జయరాజ్ అత్యధింగా రూ.36లక్షలకు పాట పాడి లడ్డూను దక్కించుకున్నాడు. వేలం పాటలో భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పిల్లి రామరాజు యాదవ్, డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డిలు పాల్గొనగా కరణ్ జయరాజు దక్కించుకున్నారు. గతేడాది ఇక్కడి లడ్డూను రూ.11.75 వేలకు ఏమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి వేలం పాడాడు. గత ఏడాది హైదరాబాద్ బాలాపూర్ వినాయకుడి లడ్డూ రూ.24.60లక్షలు పలికింది. దాని కంటే కూడా మించి నల్లగొండలోని లడ్డూకు ధర పలకడం విశేషం.

చండూరు ఇక.. రెవెన్యూ డివిజన్

- తుది నోటిఫికేషన్ విడుదల
- ఆర్డీఓ కార్యాలయానికి ముస్తాబవుతున్న స్త్రీశక్తి భవనం



ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటు కానున్న భవనం

చండూరు: చండూరు ఇక రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు కానుంది. ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరణ అనంతరం తెలంగాణ ప్రభుత్వం బుధవారం తుది నోటిఫికేషన్ విడుదల చేసింది. త్వరలో ఆర్డీఓ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం తెలంగాణ ప్రభుత్వం నూతన జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగానే మునుగోడు నియోజకవర్గంలో గత సంవత్సరం గట్టుపల ప్రజల చిరకాల కోరిక అయిన గట్టుపల్ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించింది. ఉప ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు చండూరు కేంద్రంగా మునుగోడు, గట్టుప్పల, మర్రిగూడ, నాంపల్లి మండలాలను కలుపుతూ రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తూ ప్రభుత్వం ఈనెల 5న నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరణ సెప్టెంబర్ 20న ముగియడంతో బుధవారం తుది నోటిఫికేషన్ విడుదల చేసింది.

దేవరకొండ డివిజన్ నుంచి ఆ రెండు..

గతంలో మర్రిగూడ, నాంపల్లి మండలాలు దేవరకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్నాయి. అయితే ఈ రెండు మండలాలు కొత్తగా ఏర్పడిన చండూరు డివిజన్‌లో చేర్చడంతో అధికారులు అక్కడినుంచి దస్తావేజులు తెప్పించుకుటున్నారు. ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటుకు స్థానికంగా నిరుపయోగంగా ఉన్న స్త్రీ శక్తి భవనాన్ని సిద్ధం చేస్తున్నారు. ఎది రోజుల్లో చండూరులో ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటై ఆర్డీఓను నియమించనున్నారు. కార్యాలయం ఏర్పాటుతో రెవెన్యూ సేవలు చేరువు కానున్నాయని ఐదుమండలాల ప్రజలు ఆనందపడుతును. వ్యక్తం చేస్తున్నారు.

హామీలు నెరవేరుస్తున్నాం..

మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా ప్రభుత్వ పరంగా ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. చండూరులో త్వరలోనే విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి చేతులు మీదుగా ఆర్డీఓ కార్యాలయ ప్రారంభిస్తాం.

–కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే మునుగోడు

వ్యవసాయశాఖ సూపరింటెండెంట్ సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన వ్యవసాయ శాఖ కమిషనరేట్
- రూ.11.90 లక్షలు అసంబద్ధంగా చెల్లించినట్లు ఆరోపణలు
- అక్రమ చెల్లింపులు జరిపినట్లుగా జిల్లా వ్యవసాయ అధికారి నివేదిక
- రికార్డులు అందజేసే వరకు సస్పెన్షన్ కొనసాగుతుందన్న కమిషనరేట్ అధికారులు
- వెంటనే అందజేయగా తెల్లారే సస్పెనన్‌ను ఎత్తివేశారని శ్రావణ్ వివరణ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: అసంబద్ధ చెల్లింపులు, రికార్డులు సబ్మిట్ చేయకపోవడం వంటి కారణాలతో జిల్లా వ్యవసాయ శాఖలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న ఎం.శ్రావణ్‌కుమార్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ సస్పెండ్ చేశారు. ఈనెల 25వ తేదీన కమిషనరేట్ నుంచి జారీ చేసిన ఈ ఉత్తర్వులు బుధవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారులకు అందాయి. ఆయన తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్‌జీఓ) జిల్లా అధ్యక్షుడు కావడంతో సస్పెన్షన్ విషయం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

అక్రమ చెల్లింపులు జరిపినట్లు ఆరోపణలు

జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ (ఎన్ఎఫ్ఎస్ఎం) పథకం వ్యవహారాలను సెక్షన్ ఇన్‌చార్జిగా శ్రావణ్‌కుమార్ చూశారు. ఈ ఏడాది మే 5వ తేదీన ఆ బాధ్యతలను జూనియర్ అసిస్టెంట్ కృష్ణకు అప్పగించారు. అయితే ఆ పథకానికి సంబంధించిన అన్ని రికార్డులను శ్రావణ్‌కుమార్ అప్పగించలేదని ఆగస్టు 11వ తేదీన జిల్లా వ్యవసాయ అధికారిగా పనిచేసిన సుచరిత రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్‌కు నివేదిక పంపారు. ప్రస్తుతం రికార్డులు, క్యాష్ బుక్‌లు మాత్రమే అప్పగించారని అందులో పేర్కొన్నారు. 2022 ఏప్రిల్ 1వ తేదీ వరకు ఆ పథకం కింద రూ.11,90,651 అక్రమ చెల్లింపులు చేశారని, రిపీటెడ్ చెల్లింపులు జరిపారని, రికార్డులు సరిగ్గా నిర్వహించకపోగా, వాటిని అందజేయలేదని అందులో వివరించారు. ఆ నివేదిక ఆధారంగా శ్రావణ్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ వ్యవసాయ శాఖ అడ్మినిస్ట్రేషన్ జేడీఏ బాలు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో ఇన్‌చార్జిగా ఉన్న వ్యక్తికి అన్ని రికార్డులు, వాటికి సంబంధించిన అన్ని పేపర్లు అందజేసే వరకు ఈ సస్పెన్షన్ అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. సస్పెన్షన్ సమయంలో శ్రావణ్‌కుమార్ ఉన్నతాధికారుల అనుమతి లేకుండా నల్లగొండ విడిచి వెళ్లడానికి వీల్లేదని అందులో వివరించారు.

సస్పెన్షన్ ఎత్తివేయలేదు

నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ పథకానికి సంబంధించి అసంబద్ధ చెల్లింపుల ఆరోపణలు, రికార్డులను అన్నింటినీ అప్పగించని కారణంగా సూపరింటెండెంట్ ఎం.శ్రావణ్ కుమార్‌ను వ్యవసాయ శాఖ కమిషనర్ సస్పెండ్ చేశారు. ఆయన సస్పెన్షన్‌ను ఇంకా ఎత్తి వేయలేదు. సస్పెన్షన్ ఎత్తివేస్తూ కమిషనరేట్ నుంచి ఎలాంటి ఉత్తర్వులు మాకు అందలేదు. ఆయన ఇచ్చిన రికార్డుల వివరాలతో కమిషనర్ కు ఫైల్ పంపించాం.

– జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రావణ్ కుమార్

సస్పెన్షన్ తొలగించారు


బదిలీ అయిన జేడీఏ తాను రిలీవ్ అయ్యే ముందు నాపై కమిషనర్‌కు ఫిర్యాదులు చేశారు. పాత ఫైళ్లు ఇవ్వాలని నన్ను అడగలేదు. అయినా కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం 26వ తేదీ నాడే ఫైళ్లను అందజేశా. దీంతో సస్పెన్షన్‌ను తొలగిస్తున్నట్లు ఫైల్‌లో రాశారు.

–సూపరింటెండెంట్ ఎం. శ్రావణ్‌కుమార్

కొత్త మండలంగా అమ్మనబోలు

ఎనిమిది గ్రామాలతో ఏర్పాటు చేస్తూ నోటిఫికేషన్

- అభ్యంతరాల స్వీకరణకు 15 రోజులు గడువు
- 34కు చేరిన మండలాల సంఖ్య



కొత్త మండలం మ్యాపు

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండల పరిధిలోని మేజర్ గ్రామ పంచాయతీ అయిన అమ్మనబోలు కేంద్రంగా ప్రభుత్వం జిల్లాలో మరో కొత్త మండలాన్ని ఏర్పాటు చేసేందుకు బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. నోటిఫికేషన్ విడుదల చేసిన 15 రోజుల్లో ప్రజల నుంచి రాత పూర్వకంగా సూచనలు, సలహాలతోపాటు ఏమైనా ఇతర అభ్యంతరాలను అయా గ్రామాలు ఉన్న జిల్లాల కలెక్టర్లకు తెలియజేయాలని నోటిఫికేషన్‌లో పేర్కొంది. కొత్త మండలం ఏర్పాటుతో జిల్లాలో మండలాల సంఖ్య 34కు చేరనుంది.

ఎనిమిది గ్రామాలతో..

నార్కట్‌పల్లి, రామ్మనపేట, శాలిగౌరారం మండలాల పరిధిలోని 8 గ్రామాలను కలిపి అమ్మనబోలు కేంద్రంగా కొత్త మండలం ఏర్పాటు కానుంది. ఇందులో నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలు, పల్లెపహాడ్, బెండల్‌పహాడ్, రామ్మనపేట మండలం సూరరాం, బి.తుర్కపల్లి, కుంకుడుపాముల, శాలిగౌరారం మండలంలోని ఉప్పలంచ, రామాంజపురం పంచాయతీలను కలిపి కొత్త మండలంగా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే ఇప్పటి వరకు నార్కట్‌పల్లి మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉండగా మూడు గ్రామాలు కొత్త మండలంలో కలడడంతో మండలంలో గ్రామ పంచాయతీల సంఖ్య 26కు తగ్గనుంది.

పోరాటం ఫలించిన వేళ!

నల్లగొండ జిల్లాలో గట్టుప్పల మండలం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన మరుసటి రోజు నుంచి మండల సాధన సమితిగా ఏర్పాటై అమ్మనబోలు కేంద్రంగా కొత్త మండలం ఏర్పాటు చేయాలని వివిధ గ్రామాల ప్రజలు పోరుబాట పట్టారు. ఈ నేపథ్యంలో ఏడాది నుంచి అమ్మనబోలు గ్రామంలో దీక్షలు, ధర్నాలు కొనసాగించారు. జిల్లా మంత్రితో పాటు వివిధ శాఖల మంత్రులు, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు వినతి పత్రం ఇచ్చారు. ఎట్టకేలకు కొత్త మండలం ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించడంతో ప్రజల పోరాటానికి ఫలితం దక్కినట్టు అయ్యింది.

మంత్రి, ఎమ్మెల్యే కృషి వల్లే..



మంత్రి జగదీష్‌రెడ్డి సహకారం, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కృషి వల్లే అమ్మనబోలు మండలంగా ఏర్పాటైంది. ఇందుకు కలకొలను శ్రీనివాస్‌రెడ్డి ఎంతో కృషి చేశారు. మండలం ఏర్పాటుకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు.

– బద్దం రాంరెడ్డి, మండల సాధన సమితి అధ్యక్షుడు

వారికి ప్రత్యేక ధన్యవాదాలు



ఏడాది నుంచి చేస్తున్న పోరాటానికి ఫలితం దక్కింది. ఎమ్మెల్యే మాకు ఇచ్చిన మాట ప్రకారం మండలం ఏర్పాటు చేయించారు. అందుకు మేము ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుతున్నాం.

– కొంపెల్లి సైదులు, ఎంపీటీసీ

ఉద్యమాల ఫలితంగానే..

ఏడాది పాటు సాగిన పోరాటం ఫలితంగానే ప్రభుత్వం అమ్మనబోలు మండలం ఏర్పాటు చేసింది. ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, కలకొలను శ్రీనివాస్‌రెడ్డి కృషితో కొత్త మండలం ఏర్పాటు కానుండడం ఆనందంగా ఉంది.

శ్రవణ్‌కుమార్, సీపీఐ, జిల్లా నేత

క్లుప్తంగా

డెంగీతో చిన్నారి మృతి


హర్షిక (ఫైల్)

మునగాల(కోదాడ): మండలంలోని సీతానగరం గ్రామపంచాయతీకి చెందిన చిన్నారి డెంగీతో బుధవారం మృతిచెందింది. వివరాలు.. సీతానగరం గ్రామ పంచాయతీకి చెందిన పుల్లూరి పరశురాములు, ఉమ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె హర్షికకు ఇటీవల తీవ్రమైన జ్వరం వచ్చింది. దీంతో ఆమెను చికిత్స నిమిత్తం తల్లిదండ్రులు యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. డెంగీ సోకిందని చెప్పి అక్కడి వైద్యులు చికిత్స చేసినప్పటికీ పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందింది.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని మృతి..?

కోదాడ: పట్టణ పరిధిలోని గుడిబండ రోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాల హాస్టల్‌లో ఉంటూ 8వ తరగతి చదువుతున్న బాలిక మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు సమాచారం. ఈ సంవత్సరమే ఆ పాఠశాలలో చేరిన బాలిక హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ కావడంతో అనారోగ్యానికి గురై మరణించిందని తోటి విద్యార్థులు అంటున్నారు. కాగా ఈ విషయం బయటకు పొక్కకుండా సదరు పాఠశాల యాజమాన్యం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పట్టణ పోలీసులు అంటున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. వ్యక్తి దుర్మరణం


వెంకన్న (ఫైల్)

సూర్యాపేట రూరల్: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన సూర్యాపేట పట్టణ పరిధిలోని గాంధీనగర్ వద్ద జనగాం రహదారిపై బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్వపల్లి మండలం కుంచమర్తి గ్రామానికి చెందిన మహంకాళి వెంకన్న (45) బైక్‌పై సూర్యాపేటకు వస్తుండగా పట్టణంలోని గాంధీనగర్ వద్ద జనగామ రహదారిపై లారీ ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మట్టపల్లి హుండీ ఆదాయం రూ.17.54లక్షలు

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో బుధవారం హుండీ ఆదాయం లెక్కించారు. మూడు నెలలకు గాను రూ.17,54,845 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఈ హుండీ లెక్కింపును ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ మహేందర్‌కుమార్, మిర్యాలగూడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఇ. రమేష్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ సిరికొండ నవీన్, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


హుండీల లెక్కింపును పరిశీలిస్తున్న ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్, ధర్మకర్తలు

రైతులకు రూ.2.20కోట్ల కుచ్చుటోపీ

- అన్నదాతల నుంచి ఎక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసిన ధాన్యం వ్యాపారి
- అదే ధాన్యాన్ని తక్కువ ధరకు మిల్లులకు అమ్ముకుని డబ్బుతో పరార్
- రైతులకు డబ్బులు చెల్లించకుండా కాలయాపన
- ఒక్క చిలుకూరులోనే రైతులకు ఇవ్వాలిన డబ్బులు రూ.1.20కోట్లు
- సూర్యాపేట జిల్లాలో ఆలస్యంగా వెలుగుచూసిన మోసం

చిలుకూరు: ఓ ధాన్యం వ్యాపారి రైతులకు మరోమారు కుచ్చుటోపీ పెట్టి పరారయ్యాడు. మధ్యవర్తుల ద్వారా రూ.2.20కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు చెల్లించకుండా ఉడాయించాడు. సూర్యాపేట జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చిలుకూరు మండలం రామ్‌చంద్రానగర్ గ్రామానికి చెందిన సత్యనారాయణ కొన్నేళ్లుగా ధాన్యం వ్యాపారం చేస్తున్నాడు. రెండేళ్లుగా బహిరంగ మార్కెట్‌లో ధాన్యం రేటు తక్కువగా ఉన్నా కనీసం రూ.200 ఎక్కువ రేటు పెట్టి రైతుల వద్ద కొనుగోలు చేశాడు. రైతులకు క్రమం తప్పకుండా డబ్బులు చెల్లించి నమ్మకాన్ని కలిగించాడు. చిలుకూరు, మాధవగూడెం, కొండాపురం గ్రామాల్లో మధ్యవర్తులను ఏర్పాటు చేసుకోవడం, కొన్ని గ్రామాల్లో నేరుగా రైతుల వద్ద నుంచి గత యాసంగి ధాన్యం కూడా కొనుగోలు చేశాడు.

చిలుకూరులో రూ.1.20కోట్లు

సత్యనారాయణ రెండేళ్లుగా చిలుకూరులో సైదిరెడ్డి ద్వారా ధాన్యం వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ ఏడాది పలువురు రైతుల వద్ద నుంచి 77.50 కేజీల బస్తా ధాన్యం ధర రూ. 2100 నుంచి రూ.2300 వరకు కొనుగోలు చేశాడు. ఈ 77.50 కేజీల బస్తా ధాన్యాన్ని వ్యాపారి సత్యనారాయణ సూర్యాపేట, హుజూర్‌నగర్ మిల్లుల్లో కేవలం రూ.2వేల చొప్పున అమ్ముకొని వెంటనే డబ్బులు తీసుకున్నాడు. ఒక్క చిలుకూరులోనే సైదిరెడ్డి ద్వారా సుమారు 20 లారీల ధాన్యాన్ని కొనుగోలు చేశాడు. అయితే, ధాన్యం విక్రయించిన రైతులకు డబ్బులు చెల్లించకుండా రేపు, మాపు అంటూ రెండు మాసాలుగా కాలయాపన చేస్తూ వస్తున్నాడు. ఇలా చిలుకూరులో సైదిరెడ్డి ద్వారా రూ.1.20కోట్లతో పాటు రామ్‌చంద్రానగర్, మాధవగూడెం గ్రామాల్లోని సుమారు 100 మంది రైతులకు మొత్తం ధాన్యం డబ్బులు రూ.2.20కోట్లు ఇవ్వాల్సి ఉన్నట్లు తెలిసింది.

గతంలోనూ మోసగించి ఐపీ దాఖలు..

సత్యనారాయణ ఐదేళ్ల క్రితం రైతులకు కోటి రూపాయల వరకు ధాన్యం కొనుగోలుకు సంబంధించిన డబ్బులు ఇవ్వాల్సి ఉండగా ఐపీ దాఖలు చేశాడు. తిరిగి రెండేళ్ల క్రితం వ్యాపారాన్ని ప్రారంభించి మధ్యవర్తుల ద్వారా రైతుల్లో నమ్మకాన్ని కలిగించి మరోమారు నిండా ముంచినట్లు తెలుస్తోంది. ధాన్యం విక్రయించిన రైతులు మధ్యవర్తులతో పాటు వ్యాపారి సత్యనారాయణ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సత్యనారాయణ మూడు రోజుల క్రితమే హైదరాబాద్‌కు పారిపోయినట్లు తెలిసింది. అతడి పేరిట ఎలాంటి ఆస్తిపాస్తులు లేవని, మరోమారు ఐపీ పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాడని రైతులు వాపోతున్నారు. న్యాయం చేయాలని సంబంధిత అధికారులను వేడుకుంటున్నారు.

మిర్యాలగూడ బంద్ ప్రశాంతం


బంద్‌లో భాగంగా మూసివేసిన దుకాణాలు


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, ప్రజలు

- స్వచ్ఛందంగా పాల్గొన్న ప్రజలు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడను జిల్లాగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం చేపట్టిన మిర్యాలగూడ పట్టణ బంద్ ప్రశాంతంగా ముగిసింది. మిర్యాలగూడ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో ప్రజలు స్వచ్ఛందంగా దుకాణాలు, వ్యాపార సముదాయాలు బంద్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మిర్యాలగూడను జిల్లాగా చేయడానికి అన్ని అర్హతలున్నాయని అన్నారు. అనంతరం హనుమాన్‌పేట ఫ్లైఓవర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్, రాజీవ్‌చౌక్ మీదుగా ఈదులగూడ వరకు ప్రజలు, పలు సంఘాల నాయకులు, అడ్వకేట్ జేఏసీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఆర్డీఓ చెన్నయ్యకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నాయకులు జాడి రాజు, మాలమహానాడు నాయకుడు తాళ్లపల్లి రవి, బంజారా ఉద్యోగుల సంఘం నాయకులు మాలోతు దశరథనాయక్, మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు అన్నభీమోజు నాగార్జునచారి, కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, అడ్వకేట్ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులున్నారు. అదేవిధంగా తిరునగరు భార్గవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ, ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఖాదర్, ఉదయ్‌భాస్కర్‌గౌడ్, అమృతం సత్యం, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్, రిమాండ్

- దొంగను పట్టించిన పాత కరెన్సీ నోటు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ భీషన్న

పెద్దవూర: చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నాగార్జునసాగర్ సీఐ కే. భీషన్న తెలిపారు. బుధవారం పెద్దవూర పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ రమేష్ అజ్మీరాతో కలిసి సీఐ విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రం సివాజ్ జిల్లా భగవాన్‌పూర్ మండలం మొరకాస్ గ్రామానికి చెందిన నీరజ్‌కుమార్ సింగ్ పెద్దవూర మండలంలోని సుంకిశాల నుంచి పీఏ పల్లి మండలంలోని రంగారెడ్డిగూడెం వరకు మేఘా కంపెనీ నిర్మిస్తున్న పైపులైన్ పనుల్లో రూ.8వేల వేతనానికి వర్కర్‌గా పనిచేస్తున్నాడు. పెద్దవూర మండలంలోని సంగారం సమీపంలో మేఘా కంపెనీ ఏర్పాటు చేసిన క్యాంపులో ఉంటున్నాడు. నీరజ్‌కుమార్ సింగ్ తనకు వచ్చే వేతనం సరిపోకపోవడంతో దొంగతనం చేసి డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. అతను ఉండే క్యాంపునకు సమీపంలో సంగారం గ్రామానికి చెందిన బైరోజు భారతమ్మ నివాసముంటూ ఇంటి ముందే చిన్నపాటి కిరాణ దుకాణం నిర్వహిస్తుంది. భారతమ్మ ఈ నెల 24వ తేదీన దుకాణాన్ని బంద్ చేసి హైదరాబాద్‌లో ఉంటున్న తన కుమారుడి వద్దకు వెళ్లింది. ఇదే అదునుగా భావించిన నీరజ్‌కుమార్ సింగ్ అదే రోజు రాత్రి సమయంలో భారతమ్మ ఇంటి వెనుక వైపు తలుపునకు ఉన్న ఇనుప రాడ్డును తొలగించి ఇంట్లోకి ప్రవేశించి బీరువా తాళాలు పగులగొట్టి అందులో ఉన్న తులంన్నర బరువు ఉన్న మూడు ఉంగరాలు, రూ.10వేల నగదును అపహరించాడు. హైదరాబాద్ నుంచి వచ్చిన భారతమ్మకు బీరువాలోని బంగారం, నగదు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పాత రూ.500 నోటు పట్టించింది.

చోరీకి పాల్పడిన నీరజ్‌కుమార్ సింగ్ మరుసటి రోజు పాత రూ.500నోటును తీసుకొని భారతమ్మ దుకాణానికి వెళ్లాడు. ఆ నోటును చూసిన భారతమ్మ తాను బీరువాలో దాచుకున్న నోటు మాదిరిగానే ఉందని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చింది. దీంతో పోలీసులు నీరజ్‌కుమార్ సింగ్ కదలికలపై నిఘా పెట్టారు. బుధవారం ఉదయం సంగారం స్టేజీ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అపహరించిన సొమ్ముతో నీరజ్‌కుమార్ సింగ్ హైదరాబాద్ వెళ్లటానికి అక్కడకు రాగా పోలీసులను చూసి పరుగు లంకించుకున్నాడు. పోలీసులు అతని వెంటబడి పట్టుకుని విచారించగా.. తనకు వచ్చే వేతనం సరిపోవడం లేదని, చేసేది లేక దొంగతానికి పాల్పడ్డానని ఒప్పుకున్నాడు నిందితుడి వద్ద రూ.5500 నగదు, తులంన్నర బరువు ఉన్న బంగారు ఉంగరాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, సిబ్బంది ఆనందయోగి, రాజు, కిషన్ పాల్గొన్నారు.

అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టిన బైక్

- యువకుడు మృతి

చందంపేట: బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కల్వర్టు దిమ్మెను ఢీకొట్టడంతో యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం నేరెడుగొమ్ము మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరెడుగొమ్ము మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన గండికోట వెంకటయ్య కుమారుడు గండికోట శ్రీహరి(25) కొత్తపల్లి నుంచి నేరెడుగొమ్ముకు తన బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో నేరెడుగొమ్ము సమీపంలో బైక్ అదుపుతప్పి కల్వర్టు దిమ్మెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీహరి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నేరెడుగొమ్ము ఎస్‌ఐ రాజు తెలిపారు. మృతుడు అవివాహితుడు.

పర్యాటక రంగాన్ని ప్రోత్సహించాలి

భువనగిరి: పర్యాటకాన్ని ప్రోత్సహించే దిశగా పౌరులు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ పర్యాటక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. నరేంద్రన్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం భువనగిరి ఖిలా సమీపంలో రాక్ క్లైంబింగ్ స్కూల్ వద్ద కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్వదేశ్ దర్శన్ డెస్టినేషన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పర్యాటకంపై అవగాహన పెంచాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు ట్రావెల్ ఫర్ లైఫ్ క్యాంపెయిన్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రవీణ్, డీఈఓ కె. నారాయణరెడ్డి, ఖిలా వారసత్వ కమిటీ సభ్యులు దిడ్డి బాలాజీ, పర్వతారోహకులు శివకుమార్, మాలవత్ పూర్ణ, అన్వితారెడ్డి ఆనంద్, గైడ్ ఆవుల వినోద్ పాల్గొన్నారు.


రాక్ క్లైంబింగ్ స్కూల్ నిర్వాహకుడిని సన్మానిస్తున్న కేంద్ర పర్యాటక శాఖ అధికారి

మదర్ డెయిరీకి రాజకీయ రంగు

- బీఆర్‌ఎస్ నేతలు పెత్తనం చేస్తున్నారంటూ సభ్యుల ఆగ్రహం
- డైరెక్టర్ల ఎన్నికలు ఎందుకు నిర్వహించలేదని నిలదీత

హయత్‌నగర్: నల్లగొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సమాఖ్య (నార్మాక్) మదర్ డెయిరీ రాజకీయ రంగు పులుముకుంది. హయత్‌నగర్‌లోని ఎస్‌వీ కన్వెన్షన్ హాలులో బుధవారం నార్మాక్ మదర్ డెయిరీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి మాట్లాడుతుండగా కొందరు సభ్యులు అడ్డు తగిలారు. ప్రతి ఏడాదిలాగే ఈసారి డైరెక్టర్ల ఎన్నికలు ఎందుకు నిర్వహించలేదని నిలదీశారు. ఎన్నికలు లేకుండా సర్వసభ్య సమావేశం ఎందుకు నిర్వహించారని ప్రశ్నించారు. రాజకీయ కారణాలతోనే ఎన్నికలు నిర్వహించలేదని వాదనకు దిగారు. దీంతో చైర్మన్ తన ప్రసంగాన్ని పూర్తి చేయకుండానే వేదికపై నుంచి దిగిపోయారు.

బీఆర్‌ఎస్ నాయకుల పెత్తనం ఎక్కువైంది..

ప్రశాంతంగా ఉన్న మదర్ డెయిరీలో బీఆర్‌ఎస్ నాయకుల పెత్తనం ఎక్కువైందని, జిల్లా మంత్రి జోక్యంతో ఎన్నికలు నిర్వహించలేదని కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఐలయ్య అన్నారు. 18 గ్రామీణస్థాయి చైర్మన్ల ఎన్నికలు జరపలేదని దానిని సాకుగా చూపి డైరెక్టర్ల ఎన్నికలు నిర్వహించలేదని విమర్శించారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున ఈ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికలు జరగకుండా చేస్తున్నారని ఆరోపించారు.

పాడి రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నాం

ఈ సందర్భంగా మదర్ డెయిరీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. డెయిరీకి అధికంగా పాలు పోసే రైతులకు ప్రైవేటు డెయిరీల కంటే అధిక ధర చెల్లిస్తున్నామని, సభ్యత్వం ఉన్న రైతులు మరణిస్తే వారి కుటుంబాలకు రూ.పది వేలు ఇస్తున్నామని, మృతిచెందిన గేదెకు ఇన్సూరెన్స్ రూ.80 వేలకు పెంచుతున్నట్లు చెప్పారు. ఓటరు లిస్టులో లోపాలను సరిచేయాలని కొందరు అభ్యంతరం తెలిపినందున ఎన్నికల అధికారి డైరెక్టర్ల ఎన్నికలు నిర్వహించలేదని తెలిపారు. ఓటరు లిస్టు సరిచేసి ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

హామీలు అమలు చేయకుంటే ఓటమి తప్పదు


మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నిడమనూరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఓటమి తప్పదని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. నిడమనూరు మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం గత తొమ్మిదిన్నరేళ్లుగా ప్రజలకు అనేక హామీలు ఇచ్చారని, వాటిని అమలు చేయకుండా ఎన్నికలకు వెళ్తే ఓడిపోవడం ఖాయమన్నారు. గతంలో గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెకు దిగితే వారి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు 18 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశ వర్కర్లు తమ డిమాండ్ల సాధన కోసం పోరాడుతున్నా స్పందించడంలేదన్నారు. గృహలక్ష్మి పథకాన్ని అర్హులకు మాత్రమే వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, మల్లేష్, శ్రీశైలం, పాలడుగు నాగార్జున, వీరెల్లి వెంకటేశ్వర్లు, సలీం తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్రలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య ఘర్షణ

డిండి: వినాయక నిమజ్జనంలో భాగంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ గొడవలో ఇరువర్గాలకు చెందిన ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం డిండి మండల పరిధిలోని ఎర్రారంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రారం గ్రామంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు బుధవారం వేర్వేరుగా గణేశ్ నిమజ్జనం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నిమజ్జనానికి తరలిస్తున్న వినాయకుడు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల సమీపంలోకి రాగానే అదే ప్రాంతంలో కాంగ్రెస్ నాయకులు మరో వినాయకుడి శోభాయాత్రకు సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల నాయకులు ఎదురుపడటంతో గొడవ ప్రారంభమైంది. దీంతో ఒక వర్గంపై మరొక వర్గం దాడి చేసుకోవడంతో వడ్లకొండ జంగయ్య, వడ్లకొండ జంగమ్మ, నారిమళ్ల ఇద్దమ్మ, సీమర్ల చిన ఇద్దయ్య, సీమర్ల అంజనేయులు, మామిళ్ల మల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయాలైన వారిని చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎర్రారంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దాడికి కారణమైన పలువురిని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. గతంలో భూమి పంచాయితీ విషయంలో ఇరు వర్గాలకు చెందిన పలువురిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

వచ్చే ఎన్నికల్లోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి


మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

మిర్యాలగూడ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లోనే మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. అక్టోబర్ 5న తలపెట్టిన చలో ఢిల్లీని విజయవంతం చేయాలని చేపట్టిన జీపుజాత బుధవారం మిర్యాలగూడకు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద ఆమె మాట్లాడుతూ.. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేసి ప్రధాని మోదీ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. జనగణన చేసి నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలన్నారు. అదే విధంగా పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీలకు కూలి రేట్లు పెంచాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలెబోయిన వరలక్ష్మి, నాయకురాలు ప్రభావతి, పద్మ, అరుణ, ఊర్మిల, పార్వతి, నిర్మల, రాధాబాయి, నాగమణి, స్వరాజ్యం, రాణి, నాయకులు రాగిరెడ్డి మంగారెడ్డి, పాషా తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే మంచి ఫలితాలు


డ్రైవర్లు, కండక్టర్లకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఆర్‌ఎం శ్రీదేవి

మిర్యాలగూడ టౌన్: ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేస్తేనే ఆర్టీసీ ఆదాయానికి సంబంధించి మంచి ఫలితాలు వస్తాయని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి అన్నారు. బుధవారం మిర్యాలగూడ ఆర్టీసీ డిపోను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా ఆగస్టులో అత్యధిక ఆదాయం తీసుకొచ్చిన డ్రైవర్లు, కండక్టర్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులు వ్యక్తిగత గుర్తింపుతో పాటు తమ తమ డిపోలను ఆదాయంలో నంబర్ వన్‌గా నిలపాలన్నారు. ప్రశంసా పత్రాలు తీసుకున్న వారిని మిగతా ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రశంసా పత్రాలు అందుకున్న వారిలో కండక్టర్లు జానకి, రాములు, కోటయ్య, శారద, రామలింగేశ్వరీ, డ్రైవర్లు జనార్దన్, షఫియుద్దీన్, శంకర్‌నాయక్ ఉన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం బొల్లెద్దు పాల్, సీఐ సంధ్యారాణి ఉన్నారు.

కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య


విజయమ్మ (ఫైల్)

శాలిగౌరారం: కడుపునొప్పి భరించలేక గడ్డిమందు తాగి మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన శాలిగౌరారం మండలంలోని అడ్లూరు గ్రామంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. అడ్లూరు గ్రామానికి చెందిన తుల విజయమ్మ(57)కు 8 సంవత్సరాల క్రితం గర్భాశయ శస్త్ర చికిత్స జరిగింది. అప్పటి నుంచి ఆమె కడుపునొప్పితో బాధపడుతోంది. మంగళవారం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన విజయమ్మకు తీవ్రంగా కడుపునొప్పి రావడంతో తట్టుకోలేక పొలంవద్ద ఉన్న గడ్డిమందు తాగింది. సమీప పొలాల రైతులు గమనించి ఆమె కుటుంబ సభ్యులు సమాచారం అందించారు. విజయమ్మ భర్త మల్లయ్య స్థానికుల సహాయంతో ఆమెను 108 వాహనంలో నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతిచెందింది. మృతురాలికి వివాహితులైన కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతురాలి భర్త తుల మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

యాదగిరిగుట్ట: పట్టణ పరిధిలోని గండిచెరువు సమీపంలో కల్యాణ కట్ట వద్ద అపస్మారకస్థితిలో ఉన్న వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పట్టణ సీఐ రమేష్ బుధవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కల్యాణ కట్ట వద్ద ఈ నెల 25వ తేదీన సాయంత్రం అపస్మారకస్థితిలో ఉన్న గుర్తుతెలియని వ్యక్తిని స్థానికులు గుర్తించి 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ అదే రోజు రాత్రి 11.30గంటలకు అతడు మృతిచెందాడు. మృతుడి వివరాలు తెలియరాలేదని సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తుది ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందించాలి


మాట్లాడుతున్న ఎలక్టోరల్ అబ్జర్వర్ నిర్మల, చిత్రంలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

సాక్షి,యాదాద్రి: తుది ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందించాలని ఎలక్టోరల్ అబ్జర్వర్ కె. నిర్మల అధికారులకు సూచించారు. బుధవారం యాదాద్రి కలెక్టరేట్‌లో ఏఆర్వో, ఏఈఆర్వోలతో ఆమె సమావేశమై ఓటరు నమోదు, తొలగింపు, మార్పులు చేర్పుల దరఖాస్తులను మండలాల వారీగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటరు జాబితా రూపకల్పనలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా రూపొందించాలని సూచించారు. 2023 అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు పూర్తి చేసుకున్న వారందరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. ఓటరు జాబితాకు సంబంధించిన అన్ని రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఫాం-6, 7, 8 దరఖాస్తులను పరిశీలించి ప్రతి దరఖాస్తుకు ఒక ఫోల్డర్ ఫైల్ ఏర్పాటు చేశామని, దరఖాస్తుల విచారణ కూడా క్షుణ్ణంగా చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులపై బూత్ లెవల్ అధికారులు ఏ రోజు ఇంటికి వెళ్లారు అనేది కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో దరఖాస్తులపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా సులభంగా పరిష్కరించేలా ఏర్పాట్లు చేశామని అన్నారు. తుది ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా తిరిగి పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి. వీరారెడ్డి, ఏ. భాస్కరరావు, ఆర్డీఓ అమరేందర్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి, తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట తహసీల్దార్ కార్యాలయంలో..

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట తహసీల్దార్ కార్యాలయాన్ని ఎలక్టోరల్ అబ్జర్వర్ కె. నిర్మల సందర్శించి గ్రామాల్లో నిర్వహించిన స్పెషల్ క్యాంపెయిన్‌లో వచ్చిన ఓటరు నమోదు దరఖాస్తులు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని పేర్కొన్నారు. ఎన్నికలకు అధికారులు సిద్ధం కావాలని సూచించారు. అంతకుముందు యాదాద్రీశుడిని ఆమె దర్శించుకున్నారు. ఆమె వెంట అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డీటీ నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

చారిత్రక ప్రాంతాలకు పర్యాటక కళ

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత


సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

భువనగిరి: బీఆర్‌ఎస్ పాలనలో చారిత్రక కట్టడాలు పర్యాటక ప్రాంతాలుగా రూపుదిద్దుకుంటున్నాయని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని భువనగిరి ఖిలా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. యాదాద్రి పుణ్యక్షేత్రాన్ని ప్రభుత్వం రూ.1,300 కోట్లతో అద్భుతంగా పునర్నిర్మించిందన్నారు. వీటితో పాటు కొలనుపాకలోని జైన మందిరం, రాచకొండ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టిందన్నారు. అంతేకాకుండా పర్యాటకులను ఆకర్షించేందుకు బస్వాపూర్ రిజర్వాయర్ వద్ద 200 ఎకరాల్లో బృందవనం ఏర్పాటు చేస్తుందని చెప్పారు. చారిత్రక ప్రదేశాల ప్రాముఖ్యతను భావితరాలకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆలరించాయి. అలాగే వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి ధనుంజయ్య, మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, వైస్ చైర్మన్ కిష్టయ్య, ఆర్డీఓ కార్యాలయ ఏఓ మందడి ఉపేందర్‌రెడ్డి, కౌన్సిలర్ దిడ్డికాడి భగత్, సిబ్బంది మురళీ, సైదులు, జయ, శ్రీనివాస్,కేణుక, అభినవ్‌రెడ్డి పాల్గొన్నారు.